క్లుప్తంగా

మాజీ మంత్రి జోగి రమేష్ పరామర్శ



మైలవరం: మండలంలోని చంద్రగూడెం గ్రామానికి చెందిన బొలగాని జమలయ్య కుమారుడు బొలగాని సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి జోగి రమేష్ సోమవారం పరామర్శించారు. రమేష్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాదేవి వ్రతాలు



తిరువూరు: స్థానిక షిర్డీసాయి కల్యాణ మండపంలో సోమవారం అనఘాదేవి వ్రతాలు నిర్వహించారు. అర్చకుడు రంగాచార్యులు ఆధ్వర్యంలో 75 మంది దంపతులు పీటలపై కూర్చుని ఈ వ్రతాలు ఆచరించారు. షిర్డీసాయిబాబాకు, దత్తాత్రేయ స్వామికి, విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. మందిర కమిటీ అధ్యక్షురాలు గూడపాటి మాణిక్యాంబ, సురేష్ పర్యవేక్షించారు.

రక్తదానం చేసిన విద్యార్థులు



తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు ప్రారంభించారు. అత్యవసర సమయంలో రక్తదానం ఇతరుల ప్రాణాలను కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదాన ఆవశ్యకతను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కరస్పాండెంటు పోట్రు నాగేశ్వరరావు వివరించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తిరువూరు: ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరిగిన అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన తిరువూరు వాహినీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణ అభినందించారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కబడ్డీ పోటీల్లో రీజియన్ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన కళాశాల జట్టుకు ప్రశంసా పత్రాలను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంటు పోట్రు నాగేశ్వరరావు, ఇంజినీరింగ్ విభాగ ప్రిన్సిపాల్ నాగేంద్రబాబులు అందజేశారు.

ఘనంగా రైతు దినోత్సవం



కాకర్ల(తిరువూరురూరల్): మండలంలోని కాకర్లలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని కాకర్ల రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయంపై మండల వ్యవసాయాధికారి పద్మ, ఏఈవో కావ్య సింధులు రైతులకు అవగాహన కల్పించారు. ఆదర్శరైతు బొబ్బా మోహనరావును సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పసుమర్తి వెంకటేశ్వరరావు, నాగుబండి శ్యామసుందర్, క్లబ్ సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, సంకురాత్రి జనార్దనరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, లక్ష్మీపురం మాజీ పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి నవీన్, సుంకర కృష్ణమోహన్, ఉప్పలపాటి లక్ష్మీదాసు తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామికి ఫలయాగం

తిరువూరు: స్థానిక శ్రీరంగనాయకస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఫలయాగం నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు దారా మురళీకృష్ణ, స్వాతి ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజల అనంతరం వివిధ రకాల పండ్లతో ఫలయాగం జరిపారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు పర్యవేక్షించారు.

సదస్సులకు స్పందన కరువు

- రెవెన్యూ సదస్సులపై ఆసక్తి చూపని ప్రజలు
- అధికారుల్లోనూ అంతంతమాత్రమే
- అపరిష్కృతంగా సమస్యలు



నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి సదస్సులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

నూజివీడు: కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు స్పందన కరువైంది. భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12 నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులు కూటమి ప్రభుత్వ ప్రచార ఆర్భాటానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో సదస్సులు నిర్వహించినా..

అక్టోబర్‌లోనే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించింది. అప్పుడు అందించిన అర్జీలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాకముందే మరలా ప్రస్తుతం సదస్సులను నిర్వహిస్తున్నారు. అప్పట్లో వచ్చిన అర్జీలను ఏం చేశారనే దానికి రెవెన్యూ వర్గాల వద్ద సరైన సమాధానం లేదు. అప్పుడు వచ్చిన అర్జీలన్నింటినీ పక్కన పెట్టిన ప్రభుత్వం మరలా ఇప్పుడు సదస్సులు నిర్వహించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ సదస్సుల నిర్వహణపై రెవెన్యూ వర్గాలు సైతం ఆసక్తి చూపడం లేదు.

ప్రచార ఆర్భాటంగా..

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి అనేక సదస్సులను నిర్వహించి ప్రచారం చేసుకోవడం కొత్తేమీకాదు. గతంలో జన్మభూమి గ్రామ సభలు నిర్వహించి అందులో ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడం, ఆ తరువాత వాటిని అటకెక్కించడం తెలిసిందే. అదే మాదిరిగా ఇప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను గమనిస్తుంటే ప్రజలకు ఆసక్తి లేదని తేటతెల్లమవుతోంది. ఈనెల 12 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది.

వచ్చిన అర్జీలే నిదర్శనం..

నూజివీడు మండలంలో ఇప్పటి వరకు 10 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా అర్జీలు 89 మాత్రమే వచ్చాయి. చాలా గ్రామాల్లో పది లోపే అర్జీలు రావడం గమనార్హం. గత ప్రభుత్వం భూ వివాదాలు పరిష్కరించేందుకు భూరీసర్వే చేపట్టగా కూటమి ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టి కొత్తగా అర్జీలు స్వీకరిస్తోంది.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు

గ్రామం	వచ్చిన అర్జీలు
యనమదల	6
సుంకొల్లు	34
నర్సపేట	14
జంగంగూడెం	3
తుక్కులూరు	6
హనుమంతులగూడెం	2
ముక్కొల్లుపాడు	10
అన్నవరం	7
వెంకటాయపాలెం	2
పోతురెడ్డిపల్లి	5

మౌలిక వసతుల కల్పనకు కృషి

ట్రైనీ కలెక్టర్ నోఖ్వాల్



క్వారీ కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ నోఖ్వాల్

జి.కొండూరు: క్వారీ కార్మికులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపడతామని స్వతంత్ర హోదాలో జి.కొండూరు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ కలెక్టర్ నోఖ్వాల్ తెలిపారు. మండల పరిధిలోని గడ్డమణుగు లోయలో క్వారీ కార్మికుల క్యాంపులను స్థానిక ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఎంపీడీఓ రామకృష్ణనాయక్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల కుటుంబాలతో నేరుగా మాట్లాడిన శభం నోఖ్వాల్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్, రేషన్ కార్డులను అందజేసి వారికి అవసరమైన కనీస వసతులను కల్పిస్తామని వివరించారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ బసవలింగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



అర్జీలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 21 అర్జీలు అందగా వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జీ విద్యాసాగర్, హెచ్ఓ ఆర్ హేమ, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు డుమ్మా..

స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను డివిజనల్ స్థాయి అధికారులు కొందరు డుమ్మా కొట్టారు. మరి కొందరు అధికారులు తమ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి దాదాపు 13 శాఖలకు చెందిన అధికారులు రాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపారు. కొన్ని శాఖలకు సంబంధించి ఎవరూ హాజరుకాలేదు. డీవైఈఓ, డీఎల్‌పీఓ, సీడీపీఓ, పంచాయతీరాజ్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, పశుసంవర్ధకశాఖ, ఫారెస్ట్, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ, ఏపీసీపీడీసీఎల్ తదితర శాఖల అధికారులెవరూ హాజరుకాకపోవడం గమనార్హం.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



తిరువూరు తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి



ఆరుగొలనుపేట రెవెన్యూ సభ వద్ద ధర్నా చేస్తున్న లిబరేషన్ సభ్యులు



చిల్లబోయినపల్లిలో సదస్సులో అధికారులు

తిరువూరు: పట్టణంలోని పలు వార్డుల్లో నివేశన స్థలాలు, నివాస గృహాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చినందున వందలాది కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని స్థానికులు తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో నడిం తిరువూరు రెవెన్యూ గ్రామ సభ జరిగింది. పట్టణంలోని 5, 6, 7, 8, 20 వార్డుల్లో నివేశనస్థలాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చినందున అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయాయని, వెంటనే దేవదాయశాఖ ఈనాం భూములతో సంబంధం లేని నివేశనాస్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, పార్టీ నాయకులు షేక్ జాకీర్, గత్తం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఆనందస్వరూప్, రామలింగేశ్వరరావు, నగర పంచాయతీ కౌన్సిలర్లు సత్యవతి, హుస్సేన్ తదితరులు కూడా పట్టణంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు.

ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలి

చాట్రాయి: భూ స్వాములు ఆక్రమించుకున్న ఆటవీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం ఉల్లారావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఆరుగొలనుపేటలో రెవెన్యూ సభ వద్ద పేదలు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆరుగొలనుపేటలో ఆర్ఎస్ నంబర్ 294-1లో సుమారు 1,447 ఎకరాల ఆటవీ భూమి ఉందన్నారు. ఈ భూమిలో లక్ష్మీరాయుడు మరో 9 మంది వలస భూస్వాములు సుమారు 120 ఎకరాలు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములు పేదలకు లేదా ప్రభుత్వానికి చెందాలనే ఉద్దేశంతో భూ ఆక్రమణలపై సీపీఐ ఎంఎల్ పోరాటం చేస్తోందని ఉల్లారావు చెప్పారు. 120 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. అనంతరం డీటీ గీతకు అర్జీలు అందజేశారు. సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి, మాజీ సర్పంచ్ ఇజ్జిగాని వెంకటేశ్వరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముసునూరు: మండలంలోని చిల్లబోయినపల్లిలో సర్పంచ్ కండెపు రామగిరి అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఏడు, ధ్రువీకరణ పత్రాల కోసం ఒకటి, మొత్తం ఎనిమిది అర్జీలు అందినట్లు డెప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గరికిముక్కు సుబ్బారావు, ఈఓపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ, ఆర్ఐ దీపిక, వీఆర్వో నవీన్‌బాబు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం కాట్రేనిపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే వసంత

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్, అట్కిన్‌సన్ స్కూల్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల సౌలభ్యత, సమస్య తీవ్రతనుబట్టి అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రహదారుల నిర్మాణాలను పట్టించుకోలేదని చెప్పటంతో ఆ ప్రభుత్వంలో కూడా ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నది తమరే కదా అని స్థానికులు గుసగుసలాడుకోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.300 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని అప్పట్లో ప్రకటించి, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చేరిన తరువాత చెబుతున్న తీరు చూస్తుంటే 'ఏరు దాటేవరకు ఓడ మల్లన్న.. దాటిన తరువాత బోడి మల్లన్న' అన్న చందాన ఉందని నవ్వుకున్నారు.

గ్రామ చావిడి కూల్చివేతపై కేసు నమోదు



తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్లో రెవెన్యూ గ్రామ చావిడి భవనాన్ని కూల్చివేసిన సంఘటనపై తిరువూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నడిం తిరువూరు వీఆర్వో నాగుల్‌మీరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవనాన్ని కూల్చివేసిన కాంట్రాక్టరు ముత్యాల మధుసూదనరావు, జేసీబీ డ్రైవరు జానీలపైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వాస్తుల్ని ధ్వంసం చేసిన నేరానికి వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెవెన్యూ స్థలాన్ని రక్షించాలని వినతి

తిరువూరు పట్టణంలో విలువైన రెవెన్యూ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం జరిగిన నడిం తిరువూరు గ్రామ రెవెన్యూ సదస్సులో తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ స్థలాన్ని పరిరక్షించాలనే ఆరాటం మీకెందుకని, తమకూ బాధ్యత ఉందని తహసీల్దారు వారిపై అసహనం వ్యక్త చేశారు. ఆర్డీవో మాధురి ఈ విషయమై తాను జిల్లా కలెక్టరుకు నివేదిక పంపానని, స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూస్తామని తెలిపారు. త్వరలో గ్రామ చావిడి స్థలంలో రెవెన్యూ భవనాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. పాత భవనాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తప్పవన్నారు.

వంట ఏజెన్సీలకు కార్మిక చట్టం అమలు చేయాలి

కంచికచర్ల: స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల అధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షతన కార్మికుల సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షుడు జి.హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక చట్ట ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంట ఏజెన్సీ కార్మికులకు నెలకు రూ.3 వేలు ఇచ్చి వెట్టి చాకిరి చేయిస్తున్నారని, ప్రతి నెల ఇవ్వకుండా నాలుగు లేదా ఐదు నెలలకు ఒకసారి జీతం ఇస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వటంతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ కార్మికులు వనజాక్షి, కాంతమ్మ, మౌనిక కుమారి, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై అవగాహన అవసరం

మైలవరం: విద్యార్థులు అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై అవగాహన పెంచుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 'డేటా సైన్స్ యూజింగ్ పైథాన్' అనే అంశంపైఅవగాహన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. బ్రెయిన్ ఓ విజన్ ప్రతినిధులు విద్యార్థులకు వర్క్‌షాపు ఆవశ్యకతను వివరించారు. సీఎస్ఈ విభాగాధిపతి కన్వీనర్ డాక్టర్ డీ వీరయ్య, కో కన్వీనర్, కళాశాల డీన్ అండ్ అకడమిక్ డాక్టర్ ఎమ్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2024 గ్రాండ్ ఫినాలే..

మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2024 గ్రాండ్ ఫినాలే హార్డ్‌వేర్ ఎడిషన్ కింద విజయం సాధించి కళాశాలకు గర్వకారణమయ్యారనికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమం కర్ణాటకలోని హుబ్లీ నగరంలో కేఎల్ఈ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలి పారు. పోటీలలో తమ విద్యార్థులు అసాధారణమైన ఆవిష్కరణలు,సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. ఇతర విశ్వ విద్యాలయాల వి ద్యార్థులతో పోటీపడి మెంటారింగ్, ఇవాల్యుయేషన్ రౌండ్లతో ప్రతిభను చాటి చెప్పారన్నారు.పరిశ్రమ నిపుణులు, ఔత్సాహికులు, ప్రొఫెసర్లు జడ్జి చేశారన్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ముసునూరు: క్రీస్తు బోధనలు, ప్రేమ, శాంతి మార్గాలు అనుసరణీయమని భీమడోలుకు చెందిన ప్రముఖ జాతీయ సువార్త ప్రసంగీకుడు వంగలపూడి జోసఫ్ అన్నారు. కాట్రేనిపాడులోని సీఎస్ఐ హోలీ నూతన మందిర ప్రాంగణంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల రాంబాబు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు బి.యోహాను అధ్యక్షతన సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ విశ్వాసులతో కలిసి క్యాండిల్ సర్వీస్‌తో భారీ ర్యాలీ నిర్వహించి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫెలోషిప్ ప్రతినిధులు సంసోను, ఫ్రాన్సిస్, ఏసుదాసు, ఎల్.భూషణం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం- 2025 క్యాలెండర్లను విడుదల చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో సురేష్‌కు స్థానం



ఆగిరిపల్లి: మన హక్కుల కోసం పోరాడు, సాధించు ఉద్యమ సంస్థ నాయకుడు అయ్యంకి సురేష్ బాబుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. కొన్నేళ్లుగా చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలు, ప్రజా చైతన్య అవగాహన శిబిరాలను సురేష్ నిర్వహిస్తున్నారు. దీనికి గుర్తింపుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం లభించిందని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సురేష్‌కు సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్‌ను అందజేశారు.

తాత్కాలిక దుకాణాల నిర్వహణకు వేలం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద అమ్మవారి మాలాధారణ సందర్భంగా తాత్కాలికంగా దుకాణాలు నిర్వహించుటకు సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.31,400 ఆదాయం వచ్చినట్లు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 2025, జనవరి 3 వరకు 12 రోజుల పాటు మొత్తం నాలుగు దుకాణాల్లో మాలాధారణ వస్త్రాలు, మాలలు, ఇతర వస్తువులు విక్రయించేందుకు లైసెన్స్ హక్కు ఇస్తామన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యంలో స్థానిక పాత ఎస్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన షటిల్ క్రీడాపోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. విజేతలుగా స్థానిక నటరాజ్ - ఇరహాన్ టీమ్, రన్నర్స్‌గా రిక్రియేషన్స్ వారి హోమ్ టీమ్, మూడో స్థానంలో ఆర్టీసీ హనుమంతరావు - కార్తీక్ టీమ్, నాల్గవ స్థానంలో టీచర్ నాగేశ్వరరావు - రాంబాబు టీమ్ నిలిచాయి. విజేతల మొదటి బహుమతి రూ 5,116 లను, మెమెంటోలను నిర్వాహకులు రాజ్‌కిషోర్ నాని, కంగన్ రమేష్, భూపతి రాంబాబు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు అందజేశారు. త్వరలో మెగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి నాని తెలిపారు. కార్యక్రమంలో 108 రమేష్, గడ్డం రమేష్, అల్లిక నరసింహారావు, కామినేని రమేష్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. నూజివీడు బ్రాంచి వారి సంతాయిషీ తెలియజేయునది ... [illegible] ... T.V.N. [illegible] అడ్వకేట్ & నోటరీ, సెల్: 98494 51432. తేది.23-12-2024

పాతనేరస్తుల బైండోవర్

చాట్రాయి: గ్రామాల్లో అక్రమ మద్యం తరలింపు, విక్రయాలు, సారా తయారీ, విక్రయాల నేపథ్యంలో తొమ్మిది మంది పాత నేరస్తులను తహసీల్దార్ డి.ప్రశాంతి ఎదుట బైండోవర్ చేసినట్లు సోమవారం నూజివీడు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం తరలింపు, సారా తయారీ విక్రయాల వల్ల సామాన్య జన జీవనానికి విఘాతం కలుగుతోందని సీఐ అన్నారు. మండలంలోని నరసింగపాలెం, పోతనపల్లి, చిత్తపూరు, పోలవరం, ఆరుగొలనుపేటకు చెందిన తొమ్మిది మందిని సోమవారం తహసీల్దార్ ప్రశాంతి వద్ద హాజరు పర్చగా, మరలా నేరాలకు పాల్పడకుండా ఉంటామనే హామీతో రూ.లక్ష పూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

బెల్టు దుకాణాల్లో మద్యం స్వాధీనం

తిరువూరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం పలు బెల్టు దుకాణాల్లో అక్రమంగా నిల్వచేసిన మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏకొండూరు, గంపలగూడెం మండలాల్లో జరిపిన ఆకస్మిక దాడుల్లో ఐదుగురు బెల్టు దుకాణాల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని 116 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్ తెలిపారు.



కోడిపందేల శిబిరంపై దాడి

నూజివీడు: స్థానిక సిద్ధార్థనగర్ తండాలో టీడీపీ నాయకుడు నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. గ్రామంలో కొన్నిరోజులుగా రాత్రి సమయంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో ఎవరైనా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నూజివీడు: సీతారామపురానికి చెందిన తాపీ వర్కర్ కనపర్తి భానుప్రకాష్ (21) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈనెల 15న మీర్జాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భానుప్రకాష్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారం రోజులుగా మృత్యువుతో పోరాడుతూ ఆయన చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.